వనమయ్యే బిడియపడుతూ తాను ఫాల్ట్ వంకాయి కూర తిన్నట్టు అనుమానంగా వుందన్నాడు.

డాక్టరు నవ్వలేదు.

"అదా? దాని లక్షణాలు మూడునెల్లదాకా బయట పడకపోవచ్చు. ఆరునెల్లతరవాత బయటపడినా పడవచ్చు?" అన్నాడాయన.

ఇదంతా జరిగి యింకా నెలకూడా కాలేదు.

పాపం వనమయ్యగతి యేంకానున్నదో!

# పెళ్ళివ్యవహారం

ఇంటికి చేరే సమయానికి సులోచన దడ యింకా సాంతం పోలేదు ఆమె పాదాలూ, మోకాళ్ళూ యింకా బలహీనంగానే వున్నాయి. చేతుల తిమ్మిరలు పోతూ వస్తూ వున్నాయి. తనను చూసి యింతమంది యేమనుకున్నారో వూహించుకోవటానికికూడా ఆమెకు ధైర్యం చాలలేదు. మొట్టమొదటిసారిగా ఆడది దొంగతనమో వ్యభిచారమో, తాగటమో చేస్తే తనకున్నస్థితే వుంటుందా అని ఆమె ఆశ్చర్యపడింది.

కాని తాను యింతటి వుద్రేకానికి గురికావడం సులోచనను మరింత ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే తాను చేసిందల్లా

జగన్నాథంతో ఒక గంటసేపు "వ్యవహారం" మాట్లాడింది— అంతకంటె యేమీ చెయ్యలేదు.

తనను ఒంటరిదాన్నిచేసి జగన్నాథం యేమీ చెయ్యలేదు. చేసినా తాను పెద్దగా అల్లరిచేసివుండేది కాదేమో. ఏమంటే, తనను ప్రేమించితే బాగానే వుంటుంది అని సులోచన అనుకున్న కొద్దిమంది యువకులలో జగన్నాథం ఒకడు. మనిషి అందంగా వుంటాడు. ఇరవై యెనిమిదోయేడు నడుస్తున్నది. తన యిరవై రెండేళ్ళకు యీడైనవాడు. చక్కగా "బర్మాషెల్" లో నాలుగు వందలు తెచ్చుకుంటున్నాడు. పెళ్ళికాలేదు—

జగన్నాథానికి పెళ్ళి కాలేదన్నమాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా సులోచన హృదయాన్ని శూలాలతో పొడిచినట్టుగా వుండేది. ఎందుకంటే—సులోచనకు పెళ్ళి అయింది!

అది చాలా పాపిష్టి పెళ్ళి—సులోచన జీవితానికి దేవుడు పెట్టిన పెద్దవాత.

సులోచన యింటరు పరీక్షకు కూర్చున్న కొద్దిరోజులకే జరిగిందా పెళ్ళి. అప్పటికి సులోచన తండ్రి బతికి వున్నాడు. ఆయన జీవించివుండగా వాళ్ళ యిల్లు సాంఘిక అభ్యుదయ భావాలకు కేంద్రంగా వుండేది. ఆయన మిత్రవర్గంలో హరిజనులు మొదలుకొని మహాకవులదాకా అన్నిరకాలవాళ్ళూ హోదాలవాళ్ళు వుండేవారు. సులోచన తండ్రికివున్న హోదా అది ఒక్కటే. ఆయనకు యేనాడూ పెద్ద రాబడిలేదు, తీరని దారిద్ర్యమూ లేదు. అందరూ ఆయనకు ఆర్థికసహాయంచేశారు. కాని, ఆయన యెవరికీ ఋణపడవలసి రాలేదు.

వాళ్ళ యింటికివచ్చే గొప్పవాళ్ళవెంట వారి బంధువులుకూడా వచ్చేవారు. కనీసం వెంకటరత్నం ఆ విధంగా వచ్చాడు. అతని మేనమామ పేరుమోసిన కవీ, సంస్కర్తా. ఆయన పట్నంవస్తే సులోచనవాళ్ళ యింటికి విధిగా వచ్చేవాడు. ఆయన పట్నంలో వున్నన్నాళ్ళూ వెంకటత్నం విధిగా-కాలేజీ యెగగొట్టిఅయినా సరే - ఆయన తోకలాగా తిరిగేవాడు.

ఏమైతేనేం, సంస్కృతి ధూపంతో నిషా యెక్కివున్నస్థితిలో వెంకటరత్నానికి సులోచనను పెళ్ళాడాలనీ, ఆమె తండ్రిగారికి అల్లుడు కావాలనీ ఆపుకోరాని కోరిక కలిగింది. తన తండ్రితో అనిచూశాడు. యాభైవేల ఆస్తి పరుడూ, ఒకే కొడుకూగల ఆ పెద్దమనిషి హరిజనోద్ధరణచేసే దరిద్రుల పిల్లను చేసుకోవటానికి సుతరాము వొప్పుకోలేదు. తన బావమరిది సంఘోద్ధరణచేసి బొత్తిగా శీలాన్ని నాశనం చేసుకున్నాడని ఆయన విశ్వాసం.

ఆ పరిస్థితిలో వెంకటరత్నం తండ్రిని వెర్రికుట్టెకింద కట్టేసి ఒంటిగా వచ్చి సులోచనను పెళ్ళిచేసుకున్నాడు. మైనారిటీ తీరిన ప్రతివాడూ తానుచేసే ప్రతిపనికీ బాధ్యుడని చట్టం విశ్వసించినట్టే సులోచన తండ్రికూడా విశ్వసించాడు.

తాను చేసినది పెద్ద పొరపాటని వెంకటరత్నంచేత వొప్పించటానికి అతని తండ్రికి గట్టిగా నాలుగు గంటలు పట్టలేదు.

సులోచన తండ్రి పోకముందే ఆమె వివాహబంధం తెగిపోయింది. ఆయన పోయినాక సులోచన అన్న రమణా

రావు బొత్తిగా అసహాయుడైనాడు. అతని తండ్రిగారి మిత్రులు అతనికో వందరూపాయల వుద్యోగం యిప్పించ గలిగారు. అతనికీ భార్యా, ఇద్దరు పిల్లలూ వున్నారు.

సులోచన భారం అదనపుభారం అతనికి కాని పళ్ళ బిగువున ఆ భారాన్నికూడా మోస్తూవస్తున్నాడు.

తన పెళ్ళి యిట్లా పరిణమించటంమాట అటుంచి తండ్రి పోయినాక జీవితం గురించి సులోచన చాలా తెలుసు కుంది. తన తండ్రి యెట్లాసృష్టించాడో కాని తన చుట్టూ ఒక కృత్రిమ వాతావరణం సృష్టించాడు. ఆ వాతావర ణంలో అణా పైసలకన్న ఆదర్శాలకు విలువహెచ్చు. ఆయన పోగానే వాస్తవజీవితంయొక్క నగ్న స్వరూపం సులోచనకు కనబడింది. అందులో కులమత విద్వేషాలన్నీ వున్నాయి; అందరినీ అన్నిటినీ డబ్బే శాసిస్తున్నది. దీనిలో తభావతు అణుమాత్రంకూడా లేదు.

తన పెళ్ళివిషయంకూడా మొదటిసారి నిజం గ్రహించి ఆమె నీరసించిపోయింది. ఆ వెంకటరత్నం తనను ప్రేమించి పెళ్ళాడలేదు, ఒక ఆదర్శంకోసమూ పెళ్లాడలేదు—ఏదో తాత్కాలికమైన ఆవేశాలు, విప్లవం చేస్తున్నాననే భ్రమలో ఆవేశాపరులు తమ శక్తిసామర్థ్యాలు అంచనా కట్టుకోకుండా రాజకీయోద్యమాలలోకి దూకినట్టుగా తనను పెళ్ళాడేశాడు. ఆ తరవాత, నీటిలో మునిగిపోయేవాణ్ణి యెవరో బైటికి లాగి నట్టుగా, అతన్ని తండ్రి వుద్ధరించాడు. 'బతుకు జీవుడా!' అను కని అతను పెళ్ళినుంచి బైటపడ్డాడు.

బయటపడ్డాడా లేదా అన్న విషయం యెవరికీ తోచి నట్టుగా వారు చెప్పారు.

వా డెక్కడికి పోతాడు ? కట్టుకున్న పెళ్లాన్ని చచ్చి నట్టు యేలుకోవాలి ! కోర్టుకు యీడ్చు స్త్రీ రోగం వదులుతుంది! కోర్టుకు పోతేమాత్రం యేముంది ? అతుకు అతుకే ! అసలు వున్నవాళ్ళకు, లేనివాళ్ళకు పొత్తుకుదరదులే! మనోవర్తి రాబట్టండి !... ఇంకా కొన్నియేళ్ళు గడిస్తే విడాకులు పుచ్చు కోవచ్చు... ఈ పెళ్లాన్ని వదిలేసి వాడు మళ్ళా పెళ్లాడతాడా! ఎన్ని గుండెలు ?... అదంతా తీసిపెట్టు. పిల్లమీదపిల్ల నివ్వ టానికి సిద్ధంగా బోలెడంతమంది వున్నారు !...

ఇటువంటి విజ్ఞాన మంతా వింటుంటే సులోచనకు బుర్ర గిర్రున తిరిగిపోయేది. ఇవన్నీ వట్టి ప్రగల్భాలు. మను షుల వాక్చాతుర్యానికీ జీవించవలసిన జీవితానికీ యేమీ సంబంధం లేదు.

సులోచన ఆ వెంకటరత్నంకోసం ఒక్క చిన్న నిట్టూర్పుకూడా విడవలేదు వాళ్ళిద్దరూ యెన్నడూ అయిదు నిమిషాలు బాతాఖానీకూడా కొట్టినపాపాన పోలేదు ఒక్కొక్క సారి ఆమెకు యీ జరిగిందంతా తనకు సంబంధించిన విషయం కానేకాదనికూడా భ్రమకలిగేది...

కాని, అన్న రమణారావుపైకి యేమీ అనకపోయినా తన భారాన్ని తగ్గించుకోవటానికి యేవేవో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసినప్పటినుంచీ యిది తన సమస్యేనన్న భావం ఆమెలో నిజంగా రూపొందసాగింది.

తన చెల్లెలికి తెలియకుండా రమణారావు ఆమె అత్త వారితో చాలా వుత్తరప్రత్యుత్తరాలు జరిపాడు. అతను మోతక మనిషి. దేబిరింపు వుత్తరాలు రాసివుండవచ్చునని సులోచన అనుకున్నది. సులోచన పెద్ద 'దార్ఢ్యంగల' మనిషి అని కాదు. కాని 'వాళ్ళ' దగ్గిరనుంచి వచ్చిన జవాబులు ఒకటి రెండు ఆమెకంట పడ్డప్పుడు ఆమెకు తన అన్నపైన యెంతో జాలి కలిగింది... "ఈ పెళ్ళి సవ్యంగా జరగలేదు... మీరు మీ చెల్లెలిని తార్చి మా వాణ్ణి యీ పెళ్ళికి ఒప్పించారని నాకు సందేహంగావున్నది!..." ఇటువంటి హేయమైన ఆపాదనలు ఆ వుత్తరాలలో వున్నాయి

రమణారావు కనీసం మనవర్తి అయినా సంపాదించటానికి ప్రయత్నించి విఫలుడయినాడు! అతని మోతకదనం వాళ్ళు బాగా అర్థం చేసుకున్నారు.

సులోచన మాత్రం ఏంచేస్తుంది? 'మనకు హక్కులున్నై... కోర్టుకెక్కు!' అని అన్నతో యెట్లా అంటుంది? ఒక వంక నలుగురూ రెండుపూటలా తిండి తినటమే ఎంతో కష్టంగా వుంటే!...

ఒకరోజు యేదో మాటల సందర్భంలో రమణారావు ఆడవాళ్ళు అంతో యింతో సంపాదించటం బుద్ధిగల పనిఅని యింటో గట్టిగా వాదించాడు. అది తినను మనసులో పెట్టుకునే అన్నమాట అని సులోచనకు యెన్నో రోజులకుగాని తట్టనేలేదు. తట్టినాక తన మందమతిని తలుచుకుని ఆమె కుంగిపోయింది. ఆ సంగతి యెప్పుడు జ్ఞాపకం వచ్చినా ఆమెకు యెంతో బాధ కలిగేది.

సులోచన తనంతట తనకే తట్టినట్టుగా ఒకనాడు అన్నతో, "నాకు యేదన్నా చిన్న వుద్యోగం చెయ్యాలని వున్నది!" అన్నది.

రమణారావు తనకూ ఆ ఆలోచన అదివరకు రానట్టుగా, "చేస్తే చెయ్యనూవచ్చు!" అన్నాడు.

## 2

సులోచన సంపాదించిన మొదటి చిన్న వుద్యోగంలోనే ఆమెకు మాణిక్యంతో పరిచయమయింది. ఆమెది మంచి వుద్యోగమే, ఆమె బియ్యే పాసయింది.

జగన్నాథం మాణిక్యం అన్న.

సులోచన చిన్నతనంనుంచి కూడా మగవాళ్ళలో బాహ్యాకర్షణ కన్న వాళ్ళు తన గౌరవాన్ని సంపాదించగల వాళ్ళా, కాదా అన్నది ప్రధానంగా వుండేది. మనిషి యెంత అందంగా వున్నా వాళ్ళలో కించిత్తు వెకిలితనం వుంటే ఆమె సహించలేకపోయేది.

మొదట్లో "ఓహో!" అంటే "ఓహో!" అంటూ వచ్చిన మాణిక్యం ఒకనాడు అకస్మాత్తుగా సులోచనతో గాఢస్నేహం ప్రారంభించింది. వాళ్ళిద్దరూ కలిసి సినిమాలకూ, బీచికీ షికార్లు తిరగసాగారు. ఎప్పుడన్నా జగన్నాథం వాళ్ళకు తన కారులో "లిఫ్టు" ఇచ్చేవాడు. కాని అతను పని పెట్టుకుని యెన్నడూ సులోచనను పలకరించిన పాపానకూడా పోలేదు.

మాణిక్యం మటుకు సులోచనను గురించి తెలుసుకో దగిన విషయాలన్నీ రాబట్టింది. అదంతా యెప్పటికప్పుడు జగన్నాథానికి రిపోర్టు వుతున్నదని ఆమె వూహించలేదు.

ఒకనాడు సులోచన పుట్టినరోజు—ఆమెకు పుట్టినరోజు పండగలంటూలేవు——జగన్నాధమూ, అతని చెల్లెలూ కారులో యెక్కించుకుని మౌంట్‌రోడ్డులో సింధీ బట్టల షాపుకు ఒక దానికి వెళ్ళి అవీ యివీ కొనిపెట్టారు. ఒక వీశెడు మిఠాయి కూడా కొనిపెట్టారు.

వాటిని యెట్లా నిరాకరించాలో కూడా సులోచనకు తెలియలేదు. ఆమె తన అసహాయస్థితిని తలుచుకుని కంట తడిపెట్టుకున్నది. ఆ క్షణంలో జగన్నాథం తనకేసి చూస్తూండ టం గమనించి ఆమె యెంతో అవమానపడింద.

అది ఆమె యిరవైమూడో పుట్టినరోజు.

ఇదే తన జీవితంలో ఒక విచిత్రానుభవం అను కుంటున్న సులోచనకు యివాళ అంతకు వెయ్యింతలు అపూర్వమైన అనుభవం అయింది.

అసలు ఈ అనుభవం మరే ఆడదానికన్నా అవు తుందా అనికూడా ఆమె ఆశ్చర్యపడింది.

ఆవేళ ఆదివారం, ఉదయం పదిగంటలవేళ మాణిక్యం కారులో వచ్చి సులోచనను తమ యింటికి భోజనానికి రమ్మన్నది.

"మా అన్న నీతో యేదో బిజినెస్ మాట్లాడా లన్నాడు. నీ కేమన్నా అభ్యంతరమా!" అని దారిలో ఆమె సులోచనను అడిగింది.

"బిజినెస్" అన్నమాట సులోచనకు కాళ్ళజెర్రిలాగా గగుర్పాటు కలిగించింది. బిజినెస్ అంటే వ్యాపారమో, వ్యవహారమో కావాలి. తనతో ఆ జగన్నాథానికి అటువంటి దేమీ వుండే అవకాశంలేదు. అందుచేత ఆ ముక్క మరొక అవాచ్యమైనదానికి పర్యాయపదంగా మాణిక్యం వాడి వుండాలి కాని మాణిక్యం అలా మాట్లాడే వెకిలిమనిషి కాదు.

"బిజినెసా? నాతోనా?" అన్నది సులోచన రాని నవ్వు తెచ్చుకుంటూ.

"అది మా జగన్నాథం అన్నమాటే అతను సాధారణంగా ఒక మాటకు ఒకమాట అనడు!" అన్నది మాణిక్యం.

మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనాలదగ్గిర జగన్నాథం సులోచనకు కనిపించాడు. అతను మామూలుమాటలే మాట్లాడాడు. ఆ తరువాత అతను సాయంకాలం అయిదు గంటలదాకా కనిపించనేలేదు. అతని "బిజినెస్" మాటే మరిచిపోయింది సులోచన.

అయిదుగంటలకు మళ్ళీ అతనువచ్చి బీచివీదుగా షికారు పోదామన్నాడు. కారు వెనక సీటులో ఆడవాళ్ళిద్దరూ కూచున్నారు. కారు నేరుగా అడయారు బీచికి వెళ్ళింది.

కారు ఒకచోట ఆపి జగన్నాథం సులోచనతో, "ఒక చిన్న వ్యవహారం మాట్లాడాలి. మా సిస్టర్ కారులోనే వుంటుంది. మనం అట్లా నడిచివద్దామా?" అన్నాడు.

సులోచన నిర్భయంగా అతని వెంట నడవసాగింది. దడా, వణుకూ యేమీ లేదు.

"నీ సంగతంతా మా సిస్టర్ చెప్పింది. నీ జీవిత సమస్యను గురించి ఆలోచించాను. అది పరిష్కారం కాని సమస్య కాదు. కాని యెట్లా పరిష్కరించినా యేవో చిక్కులు కొత్తవి రాక తప్పదు.

నే నొక పరిష్కారమార్గం సూచిస్తాను. నీ కిష్టమైతే దానిని వ్యవహారరీత్యా అమలు చేసుకోవచ్చు. మన యిద్దరమూ భార్యా భర్తలుగా వుందామని నేను సూచించబోతున్నాను.

అది చట్టరీత్యా సాధ్యం కాదు. చట్టరీత్యా మనం భార్యా భర్తల మవుదామని నేను సూచించటంలేదు. భార్యా భర్తల మధ్య యింకొకరకం బంధం ప్రేమబంధం. మనం ఒకరినొకరు ప్రేమించాలని కూడా నేను సూచించటంలేదు.

నిజం చెప్పాలంటే నాకు ప్రేమ అంటే చెడ్డ భయం. నా స్నేహితుడొకడు ప్రేమించి పెండ్లాడాడు. ప్రేమకు మంచు విచ్చినట్లు విచ్చిపోయే దురభ్యాసం వున్నది. ఈ ప్రేమ యెప్పుడు యే బలి కోరుతుందో యెవరూ చెప్పలేరు. కొన్ని త్యాగాలు చేసి నా స్నేహితుడిలాగా ప్రేమను పడతిట్టేకన్న, దాన్ని [illegible] వుండటమే నాకు మేలని తోస్తుంది.

నాకు శాస్త్రోక్తమైన మతవివాహాలన్నా కూడా భయమే. అది మనుషుల స్వేచ్ఛను హరించటం అట్లా వుంచి యింకొక ప్రతిఫలం యివ్వదు.

మొత్తంమీద నాకు యే రకం పెళ్ళిలోనూ నమ్మకం లేదని స్పష్టంచేశానుగద. అయితే నాకూ అందరిలాగే ఒక స్త్రీతో సుఖంగావుండాలనీ, ఆమెతో కష్టసుఖాలు పంచుకోవాలనీ పిల్లలను కనాలనీ లేకపోలేదు. అయినా వాటికోసం రొచ్చులో దిగలేక యింతకాలంగా పెళ్ళిని వాయిదా వేస్తూ వచ్చాను.

కాని నిన్నుగురించి ఆలోచిస్తుండగా ఒకమంచి పద్ధతి తోచింది—పెళ్ళి ఒక వ్యాపారబంధంగా యెందుకు చేసుకోరాదు? ఈ వ్యాపారంలో యిద్దరికీ సమానహక్కులు వున్నంతకాలము ఒకరినొకరు గౌరవించుకోవటం జరుగుతుంది. ఒకరివల్ల ఒకరికి ఆర్థికంగా నష్టం కలగకుండా ముందే తగిన కట్టుదిట్టాలు చేసుకోవచ్చు!"

"అది యెట్లా?" అన్నది సులోచన అడ్డొచ్చి.

"మన యిద్దరమూ పెళ్లాడే పక్షాన నేను నీకు నెలకింత యిస్తానని ముందే రాసి యిస్తాను. పిల్లలు పుట్టినప్పుడల్లా వాళ్ళకు కొంతడబ్బు ప్రత్యేకంగా యిస్తాను."

సులోచన నవ్వి, "వెనక డబ్బుగలవాళ్లు ఎవరినన్నా వుంచుకుంటే యిటువంటి యేర్పాట్లే చేసుకునే వారేమో!" అన్నది.

"ఆ మాట కొంతవరకు నిజమే అనుకుంటాను. కాని ఒకరు ఒకమనిషిని వుంచుకోవటంలో కొంత వ్యామోహం వుండేది. దాన్ని ఆధారం చేసుకుని వుంపుడుగత్తె తనవిటున్ని సాధ్యమైనంత శీఘ్రంగా దివాలా యెత్తించేసేది."

సులోచన కాస్త ఆలోచించి, "ఈ వ్యామోహం సమస్య యెప్పుడూ వుండనే వుంటుందేమో! అసూయ కూడానూ! బిజినెస్ పెళ్ళి చేసుకున్న జంటలో యే ఒకరికి పరాయి మనుషుల పైన వ్యామోహం పుట్టినా బిజినెస్ దివాలా యెత్తేస్తుందిగద! దానివెంట అసూయలూ, కక్షలూ, కొట్లాటలూ...!" అన్నది.

"అటువంటివి దాటగలిగిన సంస్కారం వున్నవాళ్ళకే యీ రకం పెళ్ళిసాధ్యమవుతుం దనుకుంటాను." అన్నాడు జగన్నాథం.

అతనిజుట్టు ఆకస్మాత్తుగా సులోచన చేతిలో చిక్కినట్టయింది. ఆమె అతన్ని అతినిశితమైన ప్రశ్నలు వెయ్యసాగింది. ప్రపంచంలో అందరూ యీ బిజినెస్ పెళ్లిళ్లు చేసుకునే అవకాశంవుందా? అందరూ అసూయనూ, ప్రేమనూ అధిగమించేదాకా యిలాంటి పెళ్ళిళ్ళు వాయిదాపడాలా? ఇప్పుడున్న పెళ్ళిళ్లు యెంతఘోరంగా పరిణమిస్తున్నాయో, ఈ బిజినెస్ పెళ్ళిళ్ళుకూడా అంతఘోరంగాను పరిణమించే అవకాశాలున్నాయా, లేవా! ఈ పెళ్ళిళ్ళలోవున్న ఒక్క గొప్పదనమూ డబ్బు యేర్పాట్లు చేసుకోవటంలోనే కదా వున్నది? పెళ్ళానికి నెలకు పదిరూపాయలైనా యివ్వలేని వాడు యీ వ్యాపారం యెట్లా చేస్తాడు? ఇవి అచ్చగా ధనికులు మాత్రమే చేసుకునే పెళ్ళిళ్ళేనా?

ఈ ప్రశ్నలు కొరడాదెబ్బల్లాగా తగిలాయి జగన్నాథానికి. అతను రోషంతో, "పెళ్లానికి ఒక్కపూట తిండి పెట్టలేని వాడు పెళ్ళి యెందుకు చేసుకోవాలి? మొగుడు లక్షాధికారి

అయివుండికూడా తన పెళ్ళాం స్వేచ్ఛగా ఖర్చుచేసేటందుకు రూపాయి ఇవ్వని నిర్భాగ్యులున్నారు. వారి పెళ్ళిళ్ళు సవ్యంగావుంటే నేను చెప్పే పెళ్ళి అంతకన్న వెయ్యిరెట్లు మంచిదికాదా? మొగుడూపెళ్లాలు మతంపేరనో ప్రేమ పేరనో ఒకరికొకరు దొరికిపోయి బతికున్నన్నాళ్ళు యేడిచే కంటే అంటువంటి భ్రమలకూ, కనువిప్పులకూ అతీతంగా తమ సంబంధాలు యేర్పాటు చేసుకోవటం మంచిదికదా? అన్నిటికన్న ముఖ్యం యీ పెళ్ళి యెప్పుడు యెవరురద్దు చేసుకోవాలన్నా యెవరికీ బాధగాని, నష్టంగాని వుండదే! విడాకులకంటె వెయ్యిరెట్లు తేలిక! ఇది నాగరికమైన వివాహం ఎందుకుకాదు?'' అన్నాడు

''మధ్యలో ప్రేమలూ, అసూయలూ వస్తే యేం చెయ్యాలో నాకు అర్థం కాలేదు.''

''మామూలు పెళ్ళిళ్ళకు యీ యిబ్బంది లేదా? ప్రేమలూ, అసూయలూ స్వయంకృతాపరాధాలు కావా?'' అన్నాడు జగన్నాథం.

ఇంతసేపూ యిదంతా లోకవ్యవహారం అన్నట్టు మాట్లాడుతున్న సులోచనకు యిది తనకు సంబంధించిన వ్యవహారమే నని అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చి కొద్దిగా దడపుట్టింది.

ఇద్దరూ కాస్సేపు మౌనంగా వున్న తరవాత అతను, ''ఏం, సులోచనా, యేమంటావు?'' అన్నాడు.

'ఈ పెళ్ళికి నన్నే యెందుకు యేరుకున్నారు?'' అన్నది సులోచన నిబ్బరంగానే.

"దీనికి రెండు కారణాలున్నా యనుకుంటాను. ఒకటి, ఇటువంటి పెళ్ళి నీతో సాధ్యమైనట్టుగా మరొక పెళ్ళిగాని పిల్లతో సాధ్యంకాదు. అటువంటికన్య చట్టరీత్యా వివాహం కోరుతుంది... అంటే, మనిద్దరమూ యే ఇతర కారణం చేతనైనా పెళ్ళాడ దలిస్తే నేను చెప్పిన బిజినెస్ పెళ్ళితప్ప మరొక పద్ధతిలేదు."

"ఇతర కారణాలంటే?"

"అది నా రెండో కారణం నీ అసహాయస్థితి చూస్తే నాకెందుకో పట్టరాని ఆగ్రహం కలుగుతున్నది. నీకు యింత అన్యాయం జరిగిపోయింది. కాని యెవరూ నీకు యేమీ చెయ్యలేకుండావున్నారు! ఈ సంగతి తలుచుకుంటే ఒకో-సారి నాకు నిద్రకూడా పట్టదు" అన్నాడు జగన్నాథం.

చాలాసేపు సులోచన యేమీ అనకపోవటంచూసి అతను, "తొందరలేదు. సులోచనా! ఆలోచించు, యిదుగో యీ కాగితం నీ దగ్గిరవుంచుకో. ఇందులో మన పెళ్ళికి నిబంధనలన్నీ రాసి సంతకం పెట్టాను. నీకు సమ్మతం కాకపోతే దాన్ని చించిపారెయ్యి. తాపీగా చదువుకుని ఏ విషయమూ మా సిస్టర్‌తో చెప్పు, లేకపోతే నాతోనే—" అన్నాడు.

అతను చాచిన చెయ్యి ఆమె కొంతసేపు చూడనేలేదు. కాగితం విప్పిచూసింది, కాని ఆమెకళ్ళకు ఒక్క అక్షరం కనిపించలేదు.

"షేక్ హాండ్స్!" అన్నాడతను.

సులోచన తనచెయ్యి ఇచ్చింది. బిజినెస్ !

ఇద్దరూ కారు దగ్గిరికి నడిచివచ్చారు.

సులోచననూ, మాణిక్యాన్నీ ఇంటిదగ్గిర దిగబెట్టి జగన్నాథం కారులో ఎటో వెళ్ళాడు.

"ఇంటికి పోదువుగానిలే, మంచి ఘాటైన కాఫీఇస్తాను, లోపలికిరా !" అన్నది మాణిక్యం.

ఇద్దరూ లోపలికి వెళ్ళాక, "ఏమయింది మీ బిజినెస్ ?" అని అడిగిందామె.

సులోచన తన హాండ్ బాగ్‌లోనుంచి జగన్నాథం ఇచ్చిన కాగితంతీసి ఇచ్చింది.

మాణిక్యం దాన్ని పైకి చదివింది. ఆ పత్రంలో సులోచన అతని భాగస్వామినిగా వుండేటట్టూ, అందుకుగాను అతను ఆమెకు నెలనెలా రెండువందలు యిచ్చేటట్టూ, ఆమెకు పిల్లలు కలిగితే ప్రతి బిడ్డకూ అయిదేసివేల భీమా యేర్పాటు చేసేటట్టూ రాసివున్నది.

అంతా చదివాక యిద్దరూ ఒకరికేసి ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

"ఫూల్ ! నీ మీద చాలా ప్రేమ వుండివుండాలి !" అన్నది మాణిక్యం.

"అదెట్లా ?" అన్నది సులోచన.

"నీ మీద అభిమానమో, ప్రేమో లేకపోతే నీ ఆర్థిక హక్కులను యింతగా పాటించడు. అది రూలే !" అన్నది మాణిక్యం.

ఆ క్షణంలో సులోచనలో నిజమైన దడ ఆరంభమైంది. ఆమె కాఫీకోసంకూడా ఆగకుండా బైలుదేరి యింటికి వచ్చి పడింది.

జగన్నాథం చెప్పిన మిగతా విషయా లన్నీ ఎగిరి పోయాయి, అసలు సంగతేమంటే అతను తనను ప్రేమిస్తు న్నాడు; తనతో వ్యభిచారజీవితం గడపనుంటున్నాడు !

పరువైన ఆడది అటువంటిపని యెట్లాచేస్తుంది ?

అసంభవం ! అసంభవం ! ఇక తను వాళ్ళింటికి వెళ్ళ లేదు; అతని మొహం చూడలేదు !...

## 3

"రమణారావుగారూ !"

రమణారావు వచ్చిన మనిషిని గుర్తుపట్టలేదు. ఆయనే తాను ఫలానాఅనీ, ఫలాని పనిమీద వచ్చాననీ చెప్పు కున్నాడు.

సులోచన మామగారు రాయబారిని పంపాడు. తన భర్త అయిన వెంకటరత్నం తిరిగి పెళ్ళాడితే తనకు సమ్మతమే నని సులోచన పత్రంరాసి, దానిపైన రమణారావూ, భార్యా సాక్షి సంతకాలుచేస్తే అయిదువేలిస్తారట ! ఒకప్పుడు మనో వర్తి యివ్వకుండా వుండటానికిగాను అన్నిరకాల అభాం డాలూ వేసిన మనుషులే !

"పైకం వెంట పట్టుకొచ్చాను. మళ్ళీ అలా పని చూసుకుని తొమ్మిదీ ఆ చాయల వస్తాను. ఎందుకొచ్చిన

పేచీ. వాళ్ళ కా కాగితం రాసి పారెయ్యండి. అమ్మాయి బ్రతు కెట్లాగూ పాడుకానే అయింది," అన్నాడు దూత.

ఆయన వెళ్ళిపోయాక రమణారావు సుముఖతగా, ఆ డబ్బు తీసుకొని కాగితం రాసివ్వటమే మేలని అన్నాడు.

"ఏదో పెద్ద కట్నంతో సంబంధం వచ్చివుంటుంది! పదివేలు కక్కమన్నా కక్కుతారేమో!" అన్నది రమణారావు భార్య ఆశగా.

"ఊరికే రాసిమ్మన్నా రాసిస్తాను," అన్నది సులోచన.

"నీకు పుణ్యం వుంటుంది! ఆ మాట ఆ మనిషి ఎదట అనకు!" అన్నాడు రమణారావు.

సులోచనకు నాటకం చూస్తున్నట్టుగా వున్నది.

దూత తొమ్మిది దాటగానే వచ్చాడు. అతిగాడికి వేరే పని వున్నమాట అబద్ధమై వుంటుంది. అయిదువేల ఎర జీర్ణం కావటానికి టైమిచ్చాడు, అంతే!

"అయిదువేలు మరీ తక్కువండీ! ఈ రోజుల్లో ఎకరం పొలంకూడా రాదు. మనోవర్తికింద యిచ్చినా అయిదువేలకు ముత్తం కానప్పుడు, పత్రం రాసివ్వాలంటే——" అని రమణారావనసిగాడు.

"అయ్యా, ఇట్లా లిటిగేషను పెట్టి ఏమీ లాభం వుండదు. అవతల ఆయన వుద్దండుడు. కోడలు రంకు పోయిందని కూడా సాక్ష్యం తీసుకురాగలడు. తెగ తెంపులే అనుకుని దీనికి ఒప్పుకోండీ! మీ మంచి కోరే చెబుతున్నాను!" అన్నాడు దూత.

"అధమం ఏడున్నర వేలైనా వుంటే—"

బేరం సాగింది. అరగంట అయ్యాక దూత మహా త్యాగం చేస్తున్న వాడల్లే, "అయ్యా, నా పూచీమీద యింకొక్క వెయ్యితీసుకుని ఆ కాగితం రాయించి నా మొహాన పడెయ్యండీ! తెగేదాకా లాగటం మీకూ భావ్యంకాదు!...నాకూ భావ్యంకాదు ఆ చేత్తోనే ఆ డబ్బు కూడా రసీదిప్పించండి!" అన్నాడు.

డబ్బూ పత్రాలూ చేతులు మారాయి.

"డబ్బు యేంచేస్తావ్?" అన్నాడు రమణారావు.

"నీ ఎకౌంటులో వేసివుంచు!" అని సులోచన ఒక్క నిట్టూర్పు విడిచింది.

ఆ సాయంకాలమే ఆమె జగన్నాథాన్ని వెతుక్కుంటూ వెళ్ళింది. మాణిక్యాన్ని కాఫీతెమ్మనిపంపి ఆమె జగన్నాథంతో, "మీరానాడు అడిగిన ప్రశ్నకు సమాధానం తేల్చుకున్నాను!" అన్నది.

"ఏమి టది?" అన్నాడు జగన్నాథం వుద్రేకం అణుచుకోలేకుండా.

సులోచన తన హాండ్‌బాగ్‌లోనుంచి అతను రాసి యిచ్చిన కాగితంతీసి అతనికి చూపించి, చించి ముక్కలు చేసింది.

జగన్నాథం యింత మొహం చేసుకుని, "హ్యాటేపిటీ!" అన్నాడు.

"పిటీ యేం? నేను ఒప్పుకుంటున్నాను!" అన్నది సులోచన.

ఒక్క గంతులో జగన్నాథం ఆమెను చేరి గట్టిగా వాటేసుకుని, "ఫ్రూల్! ఫ్రూల్!" అన్నాడు.

కాస్సేపటికి మాణిక్యం కాఫీకప్పులతో వచ్చేసరికి సులోచనా, జగన్నాథమూ డర్బీ స్వీప్ గెలుచుకున్న వాళ్ళ మొహాలు పెట్టుకుని కూచునివున్నారు...

# నువ్వులా - తెలకపిండి

తెలకపిండి యెట్లావస్తుందో అందరికీ తెలుసు. నువ్వులు ఆట్టే నాగరికతలేని సరుకు. అది పొలాల్లో కష్టజీవుల చేతుల్లో పెరిగి మధ్యవాళ్ళకు అమ్ముడుపోయి బస్తీ చేరుతుంది. అక్కడ దాన్ని గానుగ ఆడి నూనె తీస్తారు. ఆ నూనె అందమైన సీసాలకూ డబ్బాలకూ యెక్కి అనేక వంటిళ్ళను అలంకరిస్తుంది. తెలకపిండి చక్కను నువ్వు లాక్కవేళ చూసినా పోల్చుకోలేవు. అది గొడ్లకూ పేదవాళ్ళకూ ఆహారమౌతుంది.

నువ్వులు గానుగాడటం యేమంత గొప్ప విషయం కాదు. నేను మనుష్యుల్ని గానుగాడగా చూశాను. ఎందుచేతనో నా కా పద్ధతి రుచించలేదు.

*  *  *  *

సోమయాజులు నా ఆప్తస్నేహితుడు. వాడిపట్ల నాకున్న భావాన్నిగురించి యే కవులూ, ఏ కథకులూ రాయ